క్లుప్తంగా

ఘనంగా కుంకుమ పూజలు



ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొగల్తూరు: ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రధాన వీధుల మీదుగా పల్లకిలో ఊరేగించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గణపతి పూజ, వాసవీ పూజ, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేయడంతో గ్రామానికి చెందిన భక్తులు తరలి వచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కారుమూరి రవి, రాంబాబు, నాగళ్ళ నాగు, మానేపల్లి చిన్న, గ్రంధి శ్రీను, కారుమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: ఆరోగ్యశ్రీ వర్తించని రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం యలమంచిలి మండలం మేడపాడుకు చెందిన కుక్కల సోనికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.10 వేలు చెక్కును గుడాల గోపి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుర్రాల వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, వీరా ఉమాశంకర్ పాల్గొన్నారు.

వంటశాల నిర్మాణానికి శంకుస్థాపన



వంటశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు సూర్యప్రభ దంపతులు

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల ఆలయంలో ప్రతి శుక్రవారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు. వంటపాత్రలు ఉంచడానికి అవసరమైన వంటశాల లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతుంది. ఈ విషయం ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ దృష్టికి వెళ్లడంతో ఆమె హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తన సోదరుడు అడబాల రామ్‌ప్రసాద్‌కు వివరించారు. ఆయన స్పందించి తన తండ్రి వీరాస్వామి పేరిట రూ.50 వేలు విరాళం ఇచ్చారు. దీంతో వంటశాల నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, వెంకటేశ్వరరావు దంపతులు ఆదివారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు అడ్డాల వెంకటేశ్వరరావు, అడ్డాల ఆదినారాయణ, చీడే సూర్యనారాయణ, తోట సర్వేశ్వరరావు, ఓదూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి



వేములదీవి ఈస్ట్ గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని దీనిలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని వేములదీవి ఈస్ట్ గ్రామంలో ఆదివారం ఉదయం ప్రసాదరాజు పర్యటించారు. గ్రామంలోని పలు ప్రధాన కూడళ్లు, రోడ్ల వెంబడి ఆయన కాలినడకన పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో గ్రామస్తులు పలు సమస్యలను ప్రసాదరాజు దృష్టికి తీసుకురాగా ఆయన అధికారులతో సంప్రదించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలను తీసుకున్నామని గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, సర్పంచ్ తిరుమాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల రవికుమార్, సచివాలయ కన్వీనర్ తిరుమాని శ్రీనివాస్, పోతుల రమేష్ తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచే కాక సరిహద్దు జిల్లా అయిన కృష్ణా జిల్లా నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణ కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం

ధర్మప్రచారంలో భాగంగా ఆదివారం బండి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణలో కళాకారులు భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు కాలక్షేపం కోసంతో పాటు ధర్మ ప్రచారంలో భాగంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించడంతో స్థానిక భజన కళాకారులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కళాకారులను రప్పించి భజన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు.

వైభవంగా అతిరుద్ర మహాయాగ మహోత్సవాలు



కవిటంలో అతిరుద్ర యాగమహోత్సవాల్లో మాజీ మంత్రి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: మండలంలోని కవిటం గ్రామంలో శ్రీ సహస్రచండీ సహిత మహాసౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశ మహావిద్యా పూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పెనుమంట్ర మండలం నెలమూరుకు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్, శర్వాణీ స్కూల్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు, గ్రామస్తుల సహకారంతో ఈ యాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. యాగమహోత్సవాల్లో భాగంగా అతిరుద్ర యాగం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు జ్యోతిప్రజ్వలన చేసి యాగమహోత్సవం, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వేత్త జంధ్యాల శ్రీనివాస శర్మ(నెలమూరు శర్మ), కవిటం సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, మండ కాశీవిశ్వనాధరెడ్డి, సత్తి రామచంద్రారెడ్డి, మేడపాటి తమ్మిరెడ్డి, గాదె శ్రీనివాసరావు, పడాల సత్యనారాయణరెడ్డి, సత్తి మురళీకృష్ణారెడ్డి , కర్రి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం



మూలవిరాట్ వాసవీ మాత



వాసవీమాతకు కాలినడకన సారె తీసుకువెళుతున్న దృశ్యం

పెనుగొండ: త్యాగశీలి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్థానిక బజారు రామాలయం నుంచి వెండి పల్లకీపై అమ్మవారి ఉత్సవంలో నిర్వహించారు. వేద పండితుడు రామడుగుల నరసింహమూర్తి ఆధ్వర్యంలో 102 హోమ క్రతువుల్లో వాసవీ హోమం నిర్వహించి మాలధారులు వాసవీ దీక్షను విరమించారు. అఖిల భారత వాసవీ శాంతి ధాంలోనూ ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. మరకతశిల వాసవీ మాతను 102 గోత్రాలతో అమ్మవారికి రజతమాలను అలంకరించారు. 250 మంది కుచిపూడి కళాకారులు నృత్యనీరాజనం సమర్పించారు.

సారె సమర్పణ

పెనుమంట్ర: శ్రీవాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నేపథ్యంలో ఆదివారం మార్టేరులోని వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో మార్టేరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి పెనుగొండ వాసవీమాత ఆలయం వరకు మహిళలు సారె చీర, పసుపుకుంకాలు, పండ్లు, పూలు, స్వీట్స్ పాదయాత్రగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమాలలో ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవీ క్లబ్ క్లబ్ సభ్యులు నూలి విజయ్‌కుమార్, మామిడి అరవింద్, ప్రసాద్, నార్కెడిమిల్లి నాగేంద్ర, మహిళా సభ్యులు గాదె సీత, నార్కెడిమిల్లి చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

'అనూహ్యం' నాటిక విజయవంతంగా ప్రదర్శించాలి



అనూహ్య నాటిక ప్రతులను నటీనట సంక్షేమ సమాఖ్య సభ్యులకు అందజేస్తున్న ఆలయ చైర్మన్

పాలకొల్లు అర్బన్: నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ నాటిక రచయిత, నటుడు, ఉపాధ్యాయుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించిన 'అనూహ్యం' సాంఘిక నాటిక రాష్ట్రంలోని అన్ని పరిషత్తులలో విజయవంతంగా ప్రదర్శించాలని శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు కోరారు. ఆదివారం నాటిక ప్రతులను శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజ చేయించి నాటిక ప్రతులను నటీనట సంక్షేమ సమాఖ్య సభ్యులకు అందజేసి అభినందించారు. ఉస్మానియా యూనివర్శిటీ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ రిటైర్డు ప్రొఫెసర్ జీఎస్ ప్రసాదరెడ్డి అనూహ్య నాటికను విశ్లేషిస్తూ మానవ సంబంధాల విలువలను తెలిపే ఉత్తమ సందేశాత్మక నాటికగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు, నాటిక నిర్వాహకుడు గుడాల హరిబాబు, గంటా ముత్యాల నాయుడు, పుత్సల నాగలింగేశ్వరరావు, మాదిరెడ్డి శ్రీనివాస్, శివాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నరేంద్రస్వామి కల్యాణం

పెనుమంట్ర: మండలంలోని భట్లమగుటూరు ఉన్న శ్రీరాజనరేంద్రస్వామి శ్రీబాలత్రిపురసుందరీదేవి కల్యాణ మహోత్సవం ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో ఆగమశాస్త్ర విధానంలో హర్షభట్టు రామరాజు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామి వారిని పెండ్లికుమారినిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. అనంతరం సాయంత్రం అంకురార్పణ, వాస్తుపూజ అనంతరం కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్టుబోర్డు చైర్మన్ బళ్ల సర్వేశ్వరరాజు, ట్రస్టు బోర్డు సభ్యులు కటికతల వెంకటేశ్వరరావు, చించినాడ వెంకటేశ్వర్లు, శ్రీరాముల గంగన్న, కుక్కల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల దరఖాస్తుకు నేడే చివరి రోజు

యలమంచిలి: శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం, కాపు వనసమారాధన కమిటీ ఆధ్వర్యంలో పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని కాపు, తెలగ, బలిజ పేద విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తు చేసుకోవడానికి సోమవారం ఒక్క రోజే గడువుందని కాపు సంఘ కన్వీనర్స్ వంగా నరసింహారావు, యర్రంశెట్టి వెంకటరత్నంలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ ప్రివిలేజెడ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తులసి రామచంద్ర ప్రభు గుంటూరు వారి ఆర్థిక సహకారంతో ఈ స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నట్లు వారు వివరించారు. ఈ నెల 25న పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో ఈ స్కాలర్‌షిప్స్ అందజేస్తామని పేర్కొన్నారు. ఇంటర్ సెకండియర్, పాలిటెక్నిక్ సెకండియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, మెడిసన్ చదువుతూ, వారు ఇప్పటి వరకు రాసిన అన్ని పరీక్షల్లో 75 శాతానికి పైబడి మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్స్ పొందడానికి అర్హులని వివరించారు. ఇతర వివరాల కోసం 73963 37393, 93969 55555 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

కర్ణభక్త సంఘం సమావేశం



కర్ణభక్త సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: శ్రీశైలం, కోటప్పకొండ ఆలయాల్లో మహాశివరాత్రికి ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు, అన్నదానం కార్యక్రమాలు మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేయాలని కర్ణభక్త సంఘం అధ్యక్షులు పొన్నా మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం స్థానిక అద్దేపల్లి వారి సత్రంలో కర్ణభక్త సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ శ్రీశైలంలో నూతనంగా నిర్మాణం చేయనున్న గదులకు దాతలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి శాగా రాంబాబు, వాసా సాంబశివరావు, అందే ముక్తేశ్వరరావు, సమతం రామారావు, అందే నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

పెనుగొండ: బాల్య వివహాలు చట్టరీత్యా నేరమని, అతిక్రమించిన వారిపై చట్టరీత్యా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆదర్స్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజింగ్ డైరెక్టరు, ప్రభుత్వ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగబుజ్జి హెచ్చరించారు. ఆదివారం ఆచంటలో ఆదర్స్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాలుపై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆడపిల్లకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్లు నిండిన తరువాత వివాహాలు చేయాలన్నారు. పిల్లలకు చదువు నేర్పించి వారి అభ్యున్నతిపిక పాటు పడాలని పిలుపునిచ్చారు.

నేడు పోలీస్ స్పందన

నరసాపురం: నరసాపురం స్టీమర్ రోడ్డులోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం పోలీస్ స్పందన కార్యక్రమం జరుగుతుందని టౌన్ ఎస్సై ప్రసాద్ చెప్పారు. జిల్లా ఎస్పీ డివిజన్‌లోని అన్ని మండలాలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సూర్యనారాయణమూర్తికి పంచామృతాభిషేకాలు

పెనుమంట్ర: మాఘమాసం తొలి ఆదివారాన్ని పురస్కరించుకుని ఆదివారం జుత్తిగలోని శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని శ్రీసూర్యనారాయణమూర్తి ఆలయ అర్చకులు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి , మహిళలు అభిషేకాలు చేశారు.

14న పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుమంట్ర: పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14న ఉదయం 10గంటలకు మండల పరిషత్ అధ్యక్షులు కర్రి వెంకట నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.పద్మజ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో స్థానిక శాసన సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేస్తారని వివరించారు. వివిధ శాఖల అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

కనకరత్నమాలకు అవార్డు

పెనుగొండ: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏపీ సీనియర్ సిటిజన్ నార్త్ మహిళా విభాగ్ అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లు చెన్నై త్యాగరాయనగర్ లో నేషనల్ ఒమెన్స్ కాన్ఫరెన్స్‌లో అపరాజిత షైనింగ్ స్టార్ అవార్డును స్వీకరించారు. ఆదివారం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో అవార్డును స్వీకరించారు. ఈ మేరకు రత్నమాల వివరాలను తెలుపుతూ కార్యక్రమంలో గ్లోబల్ కన్వీనరు టీజీ వెంకటేష్, గ్లోబల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్, గురుప్రసాద్, మాజీ శాసన సభ్యుడు అంబికా కృష్ణ పాల్గొన్నట్లు తెలిపారు.

మందాలమ్మకు బంగారు నేత్రాల సమర్పణ

పెనుగొండ: మండలంలోని వడలి గ్రామ దేవత మందాలమ్మ అమ్మవారికి సంకురాత్రి సుబ్బారావు, రాఘవ దేవి దంపతుల కుమారులు వెంకట ఆదిత్యా శ్రీనివాస్, దుర్గా ప్రతాప్ కుటుంబ సభ్యులు రూ.74 వేలు విలువైన బంగారు నేత్రాలు సమర్పించారు. ఆదివారం బంగారు నేత్రాలను కమిటీ సభ్యులకు అందించారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.